# ప్రభుత్వ భూముల పరిరక్షణ అందరి బాధ్యత



- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.1.35 కోట్లతో ప్రభుత్వ బాల సదనం భవనానికి శంకుస్థాపన

5లో..

వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 049
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
జనవరి 31, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



# తల్లులకు.. వీడ్కోలు

## ముగిసిన మేడారం జాతర

- చివరి రోజు భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
- ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్
- 8 నుంచి 12 గంటలపాటు ఎక్కడి వాహనాలు అక్కడే
- తాగేందుకు, తినేందుకు ఏమీ లేక తిప్పలు పడ్డ భక్తులు
- ఖాళీ అవుతున్న మేడారం పరిసరాలు







నాలుగు రోజుల పాటు కోట్లాది భక్తులచే పూజలందుకున్న సమ్మక్క –సారలమ్మల వన ప్రవేశంతో మేడారం మహా జాతర పరిసమాప్తమైంది. చివరి రోజు భక్తులు పోటెత్తడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. శనివారం సాయంత్రం గిరిజన పూజారులు గద్దెల వద్ద నిర్వహించాల్సిన తంతు అనంతరం భక్తి శ్రద్ధలతో వన దేవతలు తిరిగి వన ప్రవేశం చేయించారు. చిలకలగుట్టకు సమ్మక్క, కన్నెపల్లికి సారలమ్మ, పునుగొండ్లకు పగిడిద్ద రాజు, కొండాయికి గోవిందరాజును తీసుకెళ్లారు. సల్లంగ ఉంటే మళ్లీ రెండేళ్లకు వచ్చే మేడారం జాతరకు పిల్లా, పాపలతో వచ్చి మొక్కులు చెల్లించుకుంటామంటూ తల్లులకు నివేదించుకున్నారు. అయితే వనదేవతలను దర్శించుకున్న భక్తులు మేడారం నుంచి ఒక్క సారిగా తిరుగు ప్రయాణం కావడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. 8 నుంచి 12 గంటలపాటు ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగేందుకు, తినేందుకు ఏమీ లేక పోవడంతో భక్తులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. ఒక దశలో పోలీసులు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే గతంలో కంటే రెట్టింపు సంఖ్యలో జనం తరలి రావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. – వరంగల్ వాయిస్, మేడారం







వివరాలు2,7,8లో..

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, జనవరి 31, 2026











# తల్లులకు.. వీడ్కోలు

- ముగిసిన మేడారం జాతర
- చివరి రోజు భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
- ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్
- 8 నుంచి 12 గంటలపాటు ఎక్కడి వాహనాలు అక్కడే
- తాగేందుకు, తినేందుకు ఏమీ లేక తిప్పలు పడ్డ భక్తులు
- ఖాళీ అవుతున్న మేడారం పరిసరాలు

**వరంగల్ వాయిస్, మేడారం :** నాలుగు రోజులపాటు అట్టహాసంగా సాగిన మేడారం మహా జాతర శనివారం ముగిసింది. జనం వీడి సమ్మక్క–సారలమ్మ తిరిగి వన ప్రవేశం చేశారు. దీంతో మేడారం మహా జాతర పరిసమాప్తం అయింది. ఆదివాసీ పూజారులు సమ్మక్క, సారలమ్మ, సగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలపై తుది తంతు ముగించారు. చివరిఘట్టం పూర్తి కావడంతో డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య గిరిజన పూజారులు ఊరేగింపుగా వారిని ఆలయాలకు తీసుకెళ్లారు. అయితే ప్రతి సారి సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య వన ప్రవేశం నిర్వహించాల్సిన పూజారులు భక్తుల రద్దీ కారణంగా గంట ఆలస్యంగా చివరి తంతు నిర్వహించారు. ఈ మహా ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అదిక సంఖ్యలో తరలివచ్చారు. మరోవైపు అమ్మల దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో గద్దెల ప్రాంగణం రోజంతా కిక్కిరిసిపోయింది. జంపన్న వాగులో పుణ్య స్నానాలు చేసేందుకు ఎగబడ్డారు.

## కిటకిటలాడిన ఆర్టీసీ ప్రాంగణం..

భక్తులు తండోపతండాలుగా తరలి రావడంతో మేడారం కిటకిటలాడింది. ఆర్టీసీ ప్రాంగణంలో భక్తులు బస్సులకోసం గంటలతరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఎవరికివారు తాము ఇంటికి చేరాలన్న ఆతృతతో బస్సుల వెంట పరుగులు తీశారు. తల్లులను దర్శించుకున్న అనంతరం జనం ఒక్క సారిగా తిరుగు ప్రయాణం కావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. గంటల తరబడి రోడ్డుమీదే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. తాగేందుకు, తినేందుకు ఏమీ దొరకక చిన్నారులు, వృద్ధులు నానా తంటాలు పడ్డారు.

## అధికారుల హర్షం..

మేడారం జాతర విజయవంతం కావడంతో అధికార యంత్రాంగం ఆనందం వ్యక్తం చేసింది. అందరి సహాయ సహకారాలతో జాతర విజయవంతంగా నిర్వహించినట్లు మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ప్రకటించారు. అమ్మవార్ల వన ప్రవేశంతో జాతర ముగిసినట్లు ప్రకటించడంతో భక్తులు ఇంటిబాట పట్టారు. మేడారం రహదారులు భక్తుల రద్దీతో కిక్కిరిసి పోయాయి.













# తునికాకు సేకరణను ప్రారంభించాలి

■ ఏఐయూకేఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం తునికాకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి, టెండర్లు వేసి, ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. శనివారం వరంగల్ జిల్లా కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తునికాకు సేకరణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విజయలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి గిరిజన ప్రజలకు వేసవికాల పంట అయిన తునికాకు సేకరణ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించాలని కోరారు. 50 ఆకులతో కూడిన తునికాకు కట్టకు రూ.6 ప్రభుత్వ ధరగా నిర్ణయించాలన్నారు. కొన్నేళ్లుగా పెండింగులో ఉన్న బోనస్ ను ఆకు సేకరణకు ముందే ఆదివాసులకు చెల్లించాలన్నారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బులు చెల్లింపులలో అవకతవకలు, అవినీతి, అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్ ను పూర్తిచేయడంతో పాటు కూలీలకు, ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు ఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయాలకు అవకాశం ఉన్న తునికాకు సేకరణకు ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. తునికాకు సేకరణ సందర్భంలో సంభవించే అన్ని రకాల ప్రమాదాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఆదివాసీలు, గిరిజనులు పేద ప్రజలు తునికాకు సేకరణపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రధానంగా వ్యవసాయం తర్వాత రెండో ఆదాయం తునికాకు సేకరణే తెలంగాణ రాష్ట్రంలో 249 యూనిట్లు ఉన్నాయి. ఆకు కొరతగా ఏర్పడుతున్న నేటి పరిస్థితుల్లో తునికాకు కోతకు సంబంధించిన అన్ని పనులకు కూలీరేట్లు ఉల్టా పల్టా రేట్లు, కల్లెదార్లు, గిర్దావర్ల జీతాలు, లోడింగ్ అన్ లోడింగ్ వంటి అన్ని రకాల పనులకు, స్త్రీ–పురుషులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, శ్రమకు తగ్గట్టుగా ప్రభుత్వమే రేట్లు పెంచి అమలు చేయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ వరంగల్ డివిజన్ నాయకులు మైదం పాణి, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, టీయూసీఐ జిల్లా నాయకులు బిక్కు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ పోస్టాఫీసులో పాస్‌పోర్ట్ సేవలు

### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నక్కలగుట్టలోని ప్రధాన తపాలా కార్యాలయం ప్రాంగణంలో అందుబాటులో ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (POPSK) సేవలను ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ పోస్టల్ సూపరింటెండెంట్ వి.హనుమంతు ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, తపాలా శాఖ సంయుక్త భాగస్వామ్యంతో ఈ సేవలు పారదర్శకంగా అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మొదటిసారి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం. గడువు ముగిసిన పాస్‌పోర్ట్‌ల రిన్యూవల్ సేవలు. చిరునామా మార్పు, వ్యక్తిగత వివరాల సవరణ వంటి మార్పులు చేసుకోవచ్చు. గతంలో పాస్‌పోర్ట్ సేవల కోసం హైదరాబాద్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు హనుమకొండలోనే ఆ సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతాయని హనుమంతు తెలిపారు. పాస్‌పోర్ట్ కావాల్సిన వారు ముందుగా www.passportindia.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ స్లాట్ బుక్ చేసుకోవాలి. కేటాయించిన సమయానికి అసలు ధృవీకరణ పత్రాలతో హనుమకొండ హెడ్ పోస్టాఫీసులోని కేంద్రానికి హాజరుకావాలి. శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా వేగంగా సేవలు అందించడం జరుగుతుందని, విద్యార్థులు, ఉద్యోగార్థులు, విదేశీ ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బోరు మరమ్మతులు చేయించిన సర్పంచ్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** గ్రామ ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకూడదనే ఉద్దేశంతో కుసుంబాయి తండా గ్రామ పంచాయతీ పరిధిలో నిలిచిపోయిన తాగునీటి వసతిని సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న బోరు మోటార్ కాలిపోవడంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ తక్షణమే స్పందించి, తన ఆదేశాల మేరకు మోటార్‌కు మరమ్మతులు చేయించి తిరిగి నీటి సదుపాయాన్ని కల్పించారు. ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యతో పాటు గ్రామంలోని విద్యుత్ సమస్యలపై కూడా సర్పంచ్ ప్రత్యేక దృష్టి సారించారు. రామన్నగూడెం హనుమాన్ గుడి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కూడా ఎర్త్ సమస్య తలెత్తడంతో, ప్రమాదాలు జరగకుండా తక్షణమే మరమ్మతులు పూర్తి చేయించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల భద్రతే తమ ప్రాధాన్యతని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు.

# ఘనంగా తక్కళ్లపల్లి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు 55వ జన్మదిన వేడుకలను సీపీఐ హనుమకొండ జిల్లా సమితి అధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శ్రీనివాసరావు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ఏ స్టాలిన్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, కొట్టేపాక రవి, మాలోతు శంకర్, వేల్పుల సారంగపాణి, కొట్టే వెంకటేష్, గిన్నారపు రోహిత్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో..

సీపీఐ రాష్ట్ర సహాయ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వడ్డేపల్లిలోని సాయి సేవ వృద్ధ అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్ కె బాషుమియా, జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఏ స్టాలిన్, నాయకులు నేదునూరి రాజమౌళి, గన్నరాపు రమేష్, గుండె బద్రి, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్, రాష్ట్ర నాయకులు ల్యాదల్ల శరత్, వేల్పుల చరణ్, గిన్నరాపు రోహిత్, ఎర్ర నాగరాజు, దొమ్మటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీల రాజకీయ ఎదుగుదలే లక్ష్యం

### రాంపెల్లి లింగమూర్తి పిలుపు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** రాబోయే ఎన్నికల్లో నామినేషన్లు వేసిన పద్మశాలి కులబంధువులు ఐక్యమత్యంతో ముందుకు సాగి, ఘన విజయం సాధించాలని అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ రాంపెల్లి లింగమూర్తి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అభ్యర్థులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. సమాజంలో ఇతర కులాలు రాజకీయంగా సంఘటితమై ఎదుగుతుంటే, పద్మశాలీలు మాత్రం ఇంకా వెనుకబడే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన పనుల కోసం ఇతరుల దగ్గర చేతులు కట్టుకుని నిలబడే పరిస్థితి మారాలని, మన అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే అది సాధ్యమవుతుందని లింగమూర్తి పేర్కొన్నారు. "మన కులంలో సమర్థులైన నాయకులు చాలా మంది ఉన్నారు. ప్రతి జిల్లా, మండలం, వార్డుల్లో పోటీ చేస్తున్న మన పద్మశాలి అభ్యర్థులను స్వచ్ఛందంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్లందరూ కలిసికట్టుగా పద్మశాలి అభ్యర్థులను విజయం వైపు నడిపించాలని ఆయన కోరారు.

## సైనికుల్లా శ్రమించిన జర్నలిస్టులు

### సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చివరి దశకు చేరుకున్న మేడారం మహా జాతరను ప్రత్యక్షంగా దర్శించలేని భక్తులకు కూడా కళ్లకు కట్టినట్లుగా చూపించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సేవలు అపూర్వమని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. కోట్లాదిమంది భక్తుల ఆరాధనతో, సంప్రదాయ వైభవంతో నిర్వహించబడిన మేడారం జాతర విశేషాలను పత్రికలలో ఫోటోల రూపంలో విశదంగా ప్రచురిస్తూ, ప్రతి ఘట్టాన్ని ప్రజల మదిలో నిలిచేలా చూపించడంలో ప్రింట్ మీడియా కీలక పాత్ర పోషించిందన్నారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా జాతర ప్రారంభం నుంచి చివరి దశ వరకు జరిగిన అన్ని ఘట్టాలను ప్రత్యక్ష ప్రసారాలు, ప్రత్యేక కథనాలు, విశ్లేషణలతో ప్రజల ముందుకు తీసుకువచ్చిన విధానం అభినందనీయమన్నారు. అరకొర వసతులతో చలిని సహితం లెక్కచేయకుండా విపరీత రద్దీని లెక్కచేయకుండా అహర్నిశలు సైనికుల్లా శ్రమించిన జర్నలిస్ట్ మిత్రుల కృషి ప్రశంసనీయమన్నారు. మేడారం జాతర ఆధ్యాత్మిక విశిష్టతను, ప్రజల విశ్వాసాన్ని, ప్రభుత్వ ఏర్పాట్లను సమతుల్యంగా ప్రజలకు చేరవేయడంలో మీడియా చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రింట్ మీడియా యాజమాన్యానికి, ఎలక్ట్రానిక్ మీడియా అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘన్‌పూర్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే

### గుడి వంశీధర్ రెడ్డి ధీమా



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం ఖాయమని, పట్టణంపై కాంగ్రెస్ జెండా ఎగరడం తథ్యమని లింగాల ఘనపూర్ మాజీ జడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుడి వంశీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని పలు వార్డుల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని పేర్కొన్నారు. ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి నాయకత్వంలో నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో జరిగిన అభివృద్ధి పనులే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. మెజారిటీ వార్డులను కైవసం చేసుకుని మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటాం. ఫిబ్రవరి 2వ తేదీన కాంగ్రెస్ అభ్యర్థులకు పార్టీ అధికారిక బీ–ఫామ్స్ అందజేయడం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, భారీ మెజార్టీ సాధించేలా సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## తల్లులను దర్శించుకున్న చల్లా దంపతులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ శ్రీ సమ్మక్క–సారలమ్మ తల్లులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండేల దీవించండి అని అమ్మవార్లను మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతకుల సంజీవరెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్ బొల్లోజు కుమారస్వామి, నాయకులు కమల రాజేశ్వరరావు, రాయరాకుల రవీందర్, దుంపల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బొమ్మగాని భాగ్య–రవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లెబోయిన రాధా–రవి యాదవ్, ముల్కనూరి శ్రీనివాస్, కార్యకర్తలు, యూత్ నాయకులు, వేల్పుల గణేష్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** తెలంగాణ ఉద్యమ రథసారథి, విప్లవ గొంతుక, ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలను చిట్యాల మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ.. గద్దర్ తన ఆటపాటలతో తెలంగాణ సమాజాన్ని ఉర్రూతలూగించడమే కాకుండా, ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. 1949లో మెదక్ జిల్లాలో జన్మించిన గుమ్మడి విట్టల్ రావు (గద్దర్), ఉన్నత చదువులు చదివి బ్యాంకు ఉద్యోగం చేసినప్పటికీ, అణగారిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. "రిక్షా దొక్కే రహీం అన్న.. రాళ్లు కొట్టే రామన్న.." వంటి పాటలతో సామాన్య ప్రజల కష్టాలను ప్రపంచానికి చాటిచెప్పారని, పాటను ఒక శక్తివంతమైన ఆయుధంగా మలిచిన ఘనత ఆయనకే దక్కుతుందని మల్లయ్య పేర్కొన్నారు. 1997లో ఆయనపై హత్యాయత్నం జరిగినప్పటికీ, మొక్కవోని ధైర్యంతో ప్రజాస్వామ్య తెలంగాణ కోసం పోరాడారని, ఆయన మరణంతో తెలంగాణ గొంతుక మూగబోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, మహిళలు, అణగారిన వర్గాల చైతన్యం కోసం గద్దర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, మండల సీనియర్ నాయకులు గురుకుంట్ల కిరణ్, దాసారపు సాంబయ్య, చందర్, గడ్డం సదానందం పాల్గొన్నారు.

## నెలసరి పరిశుభ్రత మహిళల ప్రాథమిక హక్కు

### సుప్రీంకోర్టు తీర్పుపై ఎంపీ కావ్య హర్షం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నెలసరి పరిశుభ్రత అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం మహిళల ప్రాథమిక హక్కు అని అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హర్షం వ్యక్తం చేశారు. మహిళల ఆరోగ్యం, ఆత్మగౌరవానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.గత ఏడాది పార్లమెంట్ సమావేశాల్లోనే డా. కడియం కావ్య ఈ అంశంపై జాతీయ స్థాయిలో చర్చకు తెరలేపారు. బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న నెలసరి సమస్యలను ప్రస్తావించి, ప్రభుత్వం తగిన విధానాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. తాజాగా సుప్రీంకోర్టు సైతం ఇదే దిశగా తీర్పునిస్తూ.. దేశవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా పర్యావరణ హిత శానిటరీ ప్యాడ్స్ అందించాలని, కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ఒక సమగ్ర జాతీయ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఎంపీ కోరారు.

# జనం నుంచి వనంలోకి సమ్మక్క సారలమ్మ

- వన ప్రవేశం గావించిన పూజారులు
- చివరి రోజున పోటెత్తిన భక్తులు

**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** రెండో మేడారంగా ప్రసిద్ధిగాంచిన అగ్రంపాడు సమ్మక్క–సారలమ్మ జాతర చివరి ఘట్టం ముగిసింది. భక్తజన సందోహం మధ్యన సమ్మక్క–సారలమ్మలకు పూజారులు బలిహరణ నిర్వహించి డప్పు చప్పుళ్లు, బ్యాండ్ మేళాలతో సాంప్రదాయ రీతిలో సమ్మక్క–సారలమ్మలను వన ప్రవేశం గావించారు. వన ప్రవేశం తంతులో భక్తులు జాతర ప్రాంగణంలో కిక్కిరిసిపోయి అమ్మవార్లకు పొర్లుదండాలు పెట్టి మొక్కుకున్నారు. భక్తులు తన్మయత్వాంలో మునిగారు. మూడు రోజులపాటు భక్తులచేత పూజలు అందుకున్న తల్లులను తనివితీరా దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. చివరి రోజైనా శనివారం సమ్మక్క–సారలమ్మ దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరైనట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఆదివారం భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే అవకాశం ఉన్నందున హుండీలను తరలించకుండా గద్దెల వద్దనే ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. జాతర విజయవంతం చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రతి ఒక్కరికి దేవాదాయ శాఖ అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



### వనంలోకి సమ్మక్క సారమ్మలు ..

**వరంగల్ వాయిస్, శాయంపేట :** శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని మినీ మేడారం జాతర సమ్మక్క సారలమ్మ చివరి ఘట్టం శనివారం ముగిసింది. నాలుగు గ్రామాల ప్రజల మధ్య సమ్మక్క–సారలమ్మలను అమ్మ ధర్మయ్య, చెక్క బలరాములు డబ్బు చప్పుల్లతో వనప్రవేశం గావించారు. దీంతో జాతర ప్రాంగణంలో ఉన్న భక్తులంతా ముక్కులు చెల్లించుకున్నారు. తల్లులను దర్శించుకునేందుకు మూడు రోజులపాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంద దీన ప్రభాకర్, ఆలయ కమిటీ చైర్మన్ పల్నాటి జలంధర్, అమ్మ అశోక్, చంద్రారెడ్డి, కిరణ్, పరిపూర్ణ చారి, తడక శివప్రసాద్, బుల్లెట్ రవి, నరహరి, సదానందం పాల్గొన్నారు.





# పోలీసుల సమయస్ఫూర్తి

- పోగొట్టుకున్న రూ.16 లక్షల బంగారం పట్టివేత



**వరంగల్ వాయిస్, వేలేరు :** అప్రమత్తతతో వ్యవహరించిన వేలేరు పోలీసులు, బాధితులు పోగొట్టుకున్న సుమారు రూ. 16 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేసి, తిరిగి బాధితులకు అందజేశారు. పోలీసుల చాకచక్యంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. వేలేరు మండల కేంద్రానికి చెందిన గంజి రమేష్ బాబు కుటుంబ సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం కారులో లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతరకు బయలుదేరారు. మార్గమధ్యలో మినరల్ వాటర్ నింపుకునే క్రమంలో కారు డిక్కీ తెరిచినప్పుడు, అందులో ఉన్న బంగారు ఆభరణాల బ్యాగు ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడిపోయింది. ఆ విషయాన్ని గమనించకుండానే వారు జాతరకు వెళ్లిపోయారు. తిరుగు ప్రయాణంలో బ్యాగు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన బాధితులు, శనివారం ఉదయం వేలేరు పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న ఎస్సై సురేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డుపై పడి ఉన్న బ్యాగును స్థానిక వ్యాపారి ఒకరు తీసుకున్నట్లు సీసీ ఫుటేజీలో గుర్తించిన పోలీసులు, తక్షణమే అతడిని సంప్రదించి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 100 గ్రాముల బంగారు ఆభరణాల బ్యాగును బాధితులకు ఎస్సై చేతుల మీదుగా అప్పగించారు. లక్షల రూపాయల విలువైన నగలను తక్కువ సమయంలోనే తిరిగి ఇప్పించిన వేలేరు పోలీసులకు బాధితులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను అరికట్టడంతో పాటు, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులకు న్యాయం చేయడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు.

# రిమార్క్ లేని సర్వీస్ అభినందనీయం

- కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి



**వరంగల్ వాయిస్, మామునూరు :** వరంగల్ మామునూరు నాలుగో బెటాలియన్‌లో శనివారం పదవీ విరమణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించిన పి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.ఎ.అజీజ్ లు నేడు పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వారిని శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందుతున్న అధికారుల సేవలను కొనియాడారు. ఆర్ఎస్సై గా పోలీస్ శాఖలో చేరి, తన ప్రతిభతో అసిస్టెంట్ కమాండెంట్ స్థాయికి ఎదిగారని తెలిపారు. మూడున్నర దశాబ్దాల సుదీర్ఘ కాలంలో ఇంటెలిజెన్స్, గ్రేహౌండ్స్ వంటి కీలక విభాగాలతో పాటు 1, 12, 17 బెటాలియన్లలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కానిస్టేబుల్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించి, అంకితభావంతో పనిచేసి ఏఆర్ఎస్ఐగా పదోన్నతి పొందారని వివరించారు. ఎలాంటి రిమార్క్స్ లేకుండా, మచ్చలేని సర్వీస్‌తో పదవీ విరమణ పొందడం గర్వకారణమని కమాండెంట్ అభినందించారు. అనంతరం వారికి రావాల్సిన సీసీఎస్ నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకలో అసిస్టెంట్ కమాండెంట్స్ కృష్ణప్రసాద్, వీరన్న, రిజర్వు ఇన్స్పెక్టర్స్ రాజు, విజయ్, కార్తీక్, రవి, పురుషోత్తం రెడ్డి, రాజ్ కుమార్, కృష్ణ, యూనిట్ హాస్పిటల్ సిబ్బంది, మినిస్ట్రియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో రాజీ పడొద్దు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- బాల సదనం భవనానికి శంకుస్థాపన




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పూర్తిస్థాయి పట్టణ ప్రాంతం కావడంతో ఇక్కడి ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అటు అధికారులు, ఇటు ప్రజలపై ఉందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ 31వ డివిజన్ న్యూ శాయంపేటలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ బాలికల బాల సదనం నూతన భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుమారు 100 మంది అభాగ్య బాలికలకు ఆశ్రయం కల్పించేలా ఈ భవనాన్ని అత్యాధునికంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత తగ్గకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతికి అనుగుణంగా అభివృద్ధి సాగితేనే పట్టణాలు సుస్థిరంగా ఉంటాయని, చెట్లు మరియు ఖాళీ స్థలాల రక్షణకు అందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించవద్దని, అన్యాయాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఒకప్పుడు చిన్న గ్రామంగా ఉన్న శాయంపేటను పట్టణ స్థాయికి తగినట్లుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా కేటాయించామని ఆయన వివరించారు. కార్యక్రమం అనంతరం పదవీ విరమణ పొందుతున్న జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి జెట్టి జయంతిని ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో చివరి రోజు కూడా క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మోహన్ రావు, శివశంకర్, ఆర్జేడీ ఝాన్సీ రాణి, హనుమకొండ సిడిపివో విశ్వజ, కాజీపేట తహశీల్దార్ రాజ్‌కుమార్, టీజీఈడబ్ల్యుఐడిసి అధికారులు రవీందర్, అజీజ్, బాలసదనం సూపరింటెండెంట్ కళ్యాణి, చైల్డ్ వెల్ఫర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో బీజేపీ 'ఫోర్జరీ' రాజకీయం

- నామినేషన్ తిరస్కరించిన అధికారులు

**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల పర్వంలో తీవ్ర కలకలం రేగింది. బీజేపీ నాయకులు అభ్యర్థి సంతకాన్ని ఫోర్జరీ చేసి నామినేషన్ పత్రాన్ని సమర్పించేందుకు ప్రయత్నించగా, ఆ ప్రయత్నం కాస్తా అధికారుల విచారణలో విఫలమైంది. పరకాల మున్సిపల్ 14వ వార్డు నుంచి బీజేపీ అభ్యర్థిగా సిరంగి భాగ్యలక్ష్మి నామినేషన్ వేశారు. అయితే, ఆమె సమర్పించిన పత్రాల్లో కొన్ని చోట్ల సంతకాలు లేకపోవడాన్ని అధికారులు గమనించారు. దీంతో ఈరోజు కొందరు బీజేపీ నాయకులు అభ్యర్థి అందుబాటులో లేనప్పటికీ, దొంగచాటుగా మరొక పత్రంపై అభ్యర్థి సంతకాన్ని ఫోర్జరీ (దొంగ సంతకం) చేసి ఎన్నికల అధికారికి సమర్పించేందుకు ప్రయత్నించారు. బీజేపీ నాయకుల తీరును గమనించిన బిఆర్ఎస్ నాయకులు తక్షణమే రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకుని అభ్యంతరం వ్యక్తం చేశారు. అభ్యర్థి లేకపోయినా సంతకాలు ఎలా మారుతాయని నిలదీశారు. వాస్తవాలను పరిశీలించిన ఎన్నికల అధికారులు, ఆ నామినేషన్ పత్రాల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి, బీజేపీ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. "బీజేపీ అంటేనే మోసం.. మోసం అంటేనే బీజేపీ" అని విమర్శించారు. ఎన్నికల్లో గెలిచే సత్తా లేక ఇలాంటి అడ్డదారుల్లో ఫోర్జరీ సంతకాలతో రాజకీయం చేయాలని చూడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ ఘటన పరకాల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



# ప్రజాకంటకంగా బీజేపీ, కాంగ్రెస్ పాలన

- బూర్జువా పార్టీలతో పొత్తు కమ్యూనిస్టుల ఐక్యతకు విఘాతం
- సామాజిక వామపక్ష శక్తుల ఐక్యతకు నిరంతర కృషి
- ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ఓట్లు, సీట్ల కోసం బూర్జువా పాలక పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం కమ్యూనిస్టుల ఐక్యతకు విఘాతం కలిగిస్తుందని ఎంసీపీఐ(యూ) పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. వామపక్ష సామాజిక ఐక్యతతోనే దేశంలో దోపిడి రహిత పాలనను అందించగలుగుతామని అందుకోసం పార్టీ యావత్తు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏకశిల పార్కు వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వల్లెపు ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేయడంలో ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడంలో పోటీపడుతున్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ మతోన్మాద నియంతృత్వ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అందుకు నిదర్శనం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, ఆకలి చావులు, ఆత్మహత్యలని అన్నారు. ఎన్నికల్లో అనేక ఆచరణలో ఆమోదయోగ్యమైన హామీలను ఇచ్చి అమలు చేయడంలో విస్మరించారన్నారు. ఆదాని అంబానీల లాంటి కార్పొరేట్ శక్తులకు ఇచ్చిన రాయితీలు సబ్సిడీలు రుణమాఫీలు ఉత్పత్తిలో కీలక భూమిక పోషించే రైతులకు కూలీలకు కార్మికులకు ఇవ్వకపోవడం ప్రజా వ్యతిరేక పాలనకు అద్దం పడుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో దోపిడి రహిత పాలనకు కృషి చేయాల్సిన సీపీఎం, సీపీఐ ఓట్లు, సీట్ల కోసం మతోన్మాద బూచి చూపించి దోపిడి పాలక బూర్జువా భూస్వామ్య పార్టీలతో పొత్తు పెట్టుకోవడం ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టుల ఐక్యతకు విఘాతం కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా సీపీఐ, సీపీఎం పార్టీలు ఆత్మ విమర్శ చేసుకుని పునరాలోచన చేసుకుని వామపక్ష సామాజిక కమ్యూనిస్టుల ఐక్యతకు కృషి చేయాలని కోరారు. ఎంసీపీఐ(యూ) దేశంలో సామాజిక వర్గ పోరాటాలను జమిలిగా నడపడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికల ఎత్తుగడలు రూపొందించుకొని పోటీ చేస్తున్నామన్నారు. కార్యకర్తలు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్, కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు కూతురు ఇంద్రారెడ్డి, మొగిలి శ్రీనివాస రావు కర్ర సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అద్భుత శిల్ప సంపద 'కోటగుళ్లు'

- జిల్లా జడ్జి రమేష్ బాబు



**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల కాలం నాటి అద్భుత శిల్ప సంపదకు నిలయం గణపురం కోటగుళ్లు అని భూపాలపల్లి జిల్లా జడ్జి రమేష్ బాబు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల కొనియాడారు. శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న జడ్జిలకు అర్చకులు జూలపల్లి నాగరాజు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్జిలు గణపతి, నందీశ్వరులకు పట్టు వస్త్రాలు సమర్పించి, గణపేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జడ్జిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన పూర్వీకులు అందించిన ఇలాంటి అద్భుతమైన శిల్ప సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, దీనిని భావితరాలకు సజీవంగా అందించాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో జడ్జి అఖిల తల్లిదండ్రులు గంగినేని పద్మావతి, శ్రీనివాసరావు దంపతులు కూడా పాల్గొన్నారు. సేవా దృక్పథంతో జిల్లా జడ్జి రమేష్ బాబు అక్కడి గోశాలలోని గోమాతల కోసం రూ. 10 వేల విలువైన దానా బస్తాలను విరాళంగా అందజేశారు. ఈ ఉదారతకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ సభ్యులు జడ్జి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, నడికూడ:** రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకత పెంచేందుకు మరియు సరఫరాను సులభతరం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'యూరియా బుకింగ్ యాప్' శనివారం నుంచి ప్రారంభమైనట్లు నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ తెలిపారు. రైతులు తమ స్మార్ట్‌ఫోన్‌లలోని గూగుల్ ప్లే స్టోర్ నుండి 'ఫర్టిలైజర్ బుకింగ్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మక్కజొన్న, వరి సాగు చేసే రైతులు ఈ యాప్ ద్వారా తమ అవసరాలకు తగినట్లుగా యూరియాను బుక్ చేసుకోవచ్చు. యాప్‌లో మొబైల్ నంబర్ నమోదు చేయగానే వచ్చే ఓటీపీ ఆధారంగా బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. రైతులు తమ భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంట వివరాల ఆధారంగానే యూరియా పొందే అవకాశం ఉంటుంది. భూమి విస్తీర్ణాన్ని బట్టి ప్రతి 15 రోజులకు ఒకసారి మాత్రమే యూరియా బుకింగ్ చేసుకునే వీలుంటుందని ఏఓ స్పష్టం చేశారు. యూరియా బుకింగ్‌లో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉన్నా లేదా సందేహాలు ఉన్నా రైతులు తమ సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. మండలంలోని రైతులందరూ ఈ ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని జైసింగ్ విజ్ఞప్తి చేశారు.

# కొత్తకొండ జాతర హుండీ ఆదాయం రూ. 69,488

**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** కొత్తకొండ మండల పరిధిలోని భీమదేవరపల్లిలో వెలసిన శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర హుండీ లెక్కింపును శనివారం దేవదాయ శాఖ అధికారులు పారదర్శకంగా నిర్వహించారు. జాతర సందర్భంగా భక్తులు సమర్పించుకున్న కానుకలను అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించారు. దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి పి.కిషన్ రావు వెల్లడించిన వివరాల ప్రకారం.. నోట్ల రూపంలో వచ్చిన ఆదాయం రూ. 56,910, నాణేల రూపంలో వచ్చిన ఆదాయం రూ. 12,578, కాగా, మొత్తం ఆదాయం రూ. 69,488 గా వెల్లడించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, స్థానిక సర్పంచ్, గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిబంధనల ప్రకారం ఆలయ అభివృద్ధి పనులకు వినియోగిస్తామని అధికారులు తెలిపారు.

# రేపటి నుంచే ‘సీఎం కప్’ క్రీడా పోటీలు


## విజయవంతం చేయాలని ఎంపీడీఓ పిలుపు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి:** హసన్ పర్తి మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు సీఎం కప్ మండల చైర్మన్, ఎంపీడీఓ సుమన వాణి తెలిపారు. మండలంలోని క్రీడాకారులందరూ ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని ఆమె కోరారు. రూరల్ పరిధికి సంబంధించిన ఈ పోటీలు ఎర్రగట్టు గుట్ట వద్ద ఉన్న కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో జరుగుతాయని ఆమె వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు ఉదయం 9 గంటలలోపు తమ ఆధార్ కార్డు లేదా సీఎం కప్ రిజిస్ట్రేషన్ అక్నాలెడ్జ్మెంట్ పత్రంతో మైదానానికి చేరుకోవాలని సూచించారు. మండల స్థాయిలో ప్రధానంగా అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగా, చెస్, కరాటేతో పాటు క్యారమ్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, సైక్లింగ్, హాకీ, స్విమ్మింగ్, రెజ్లింగ్, సాఫ్ట్‌బాల్ వంటి అనేక క్రీడా విభాగాల్లో పోటీలు ఉండనున్నాయి. పారా గేమ్స్ కూడా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. క్రీడాకారులు తమ రిజిస్ట్రేషన్ అక్నాలెడ్జ్మెంట్‌ను https://satg.telangana.gov.in/cmcup/ లింక్ ద్వారా వెబ్‌సైట్‌లోకి వెళ్లి, ‘Downloads’ విభాగంలో తమ మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి పొందవచ్చునని ఎంపీడీఓ వివరించారు. పోటీలకు వచ్చే వారు తమకు అవసరమైన క్రీడా వస్తువులు, ఆహారం, నీరు మరియు వ్యక్తిగత సామగ్రిని స్వయంగా తెచ్చుకోవాలి. క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు అందరూ కలిసి ఈ సీఎం కప్ పోటీలను గ్రాండ్ సక్సెస్ చేయాలని సుమన వాణి విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ముఖ్యం

## సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి, నామినేషన్ల పరిశీలన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. నామినేషన్ల పరిశీలనలో ఎటువంటి పొరపాట్లకు తావు ఉండకూడదని స్పష్టం చేశారు. కేవలం అర్హత గల నామినేషన్లను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి అభ్యర్థి సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. పరిశీలన అనంతరం చెల్లుబాటు అయిన అభ్యర్థుల వివరాలను తక్షణమే మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రజలకు, అభ్యర్థులకు ఎప్పటికప్పుడు సమాచారం అందుబాటులో ఉండాలని, పారదర్శకతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రిటర్నింగ్ అధికారులు, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైవర్ కుటుంబానికి అండగా ‘శ్రీ రాజరాజేశ్వరి ఆటో యూనియన్’



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** తోటి డ్రైవర్ కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు మేమున్నామంటూ శ్రీ రాజరాజేశ్వరి ఆటో యూనియన్ సభ్యులు తమ ఉదారతను చాటుకున్నారు. న్యూ శాయంపేటకు చెందిన ఆటో డ్రైవర్ గుండు రాజు ఇటీవల అకాల మరణం చెందడంతో, అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు, శనివారం రాజు భార్య గుండు ప్రవళికను కలిసి ఓదార్చారు. యూనియన్ సభ్యులందరి సహకారంతో సేకరించిన రూ. 30,000/– నగదు మరియు క్వింటా బియ్యం బస్తాను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. తమ యూనియన్‌లో సభ్యుడిగా ఉన్న రాజు మరణం అత్యంత బాధాకరమని, వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సాటి డ్రైవర్ల సంక్షేమమే తమ ప్రాధాన్యతని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వేల్పుల సాంబమూర్తి, ఉపాధ్యక్షులు గుండు గోవర్ధన్, క్యాషియర్ రాసమల్ల సురేష్, నాయకులు ఎ.లక్ష్మణ్, వి.ప్రతాప్, వి.పున్నం, కె.కిషన్, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# తొర్రూరులో కాంగ్రెస్ ‘హోరు’

- గల్లీ గల్లీలో మంత్రి పొంగులేటి ప్రచారం
- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు
- అభివృద్ధికి నిధుల కొరత ఉండదు
- ప్రజల మధ్యే ఉండి సమస్యలు తీర్చుతాం
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం వేడెక్కింది. పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. శనివారం 02వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తూనం శ్రవణ్ గెలుపును కాంక్షిస్తూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 02వ వార్డులోని వీధి వీధినా మంత్రి పొంగులేటి పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో పట్టణం మారుమోగింది. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో మహిళలు, యువకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం తొర్రూరు అంగడి సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. “కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి ఆశయం. మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూస్తాం. పారదర్శక పాలన అందాలంటే హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి” అని మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. తొర్రూరు పట్టణ ముఖచిత్రాన్ని మార్చడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు, యువత సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని, నిజాయితీగా పనిచేసే నాయకులను ఎన్నుకుని పట్టణ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళితులకు అన్యాయం చేస్తే సహించం

- బీఆర్ఎస్ నేత పున్నం చందర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని భద్రకాళి దేవస్థానానికి ఆనుకుని ఉన్న చెరబండరాజు నగర్ గుడిసెవాసుల పోరాటం ఉధృతమవుతోంది. గత 23 ఏళ్లుగా ఇక్కడ నివాసముంటున్న దళితులను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారం రెండో రోజుకు చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీ 5వ డివిజన్ అధ్యక్షులు బొల్లేపెల్లి పున్నం చందర్ ఆధ్వర్యంలో కాలనీవాసులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు తమ ఆరాధ్య దైవం డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ పోరాటానికి మాల మహానాడు కుల సంఘ నాయకులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పున్నం చందర్ మాట్లాడుతూ.. “భద్రకాళి మాడ వీధుల నిర్మాణాల పేరిట దశాబ్దాలుగా నివసిస్తున్న దళితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా, ఉపాధి కల్పించకుండా గుడిసెలను కూల్చివేయాలని చూడటం దారుణం” అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఈ కుట్రలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గుడిసెవాసులకు సరైన న్యాయం జరిగేంత వరకు, వారికి పక్కా ఆశ్రయం కల్పించే వరకు అన్ని దళిత వర్గాలు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దళితుల హక్కులను కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండుగ సాగర్, మూల ప్రభాకర్, దాసరి సమ్మన్న, విశాల్, ప్రభాకర్, చెరబండరాజు నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలన్నా అది ఒక్క కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం వర్ధన్నపేటలోని ఎన్నికల కార్యాలయంలో 12 వార్డుల ముఖ్య నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీలతో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తో కలిసి ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు వర్ధన్నపేట పట్టణాన్ని కేవలం ఓటు బ్యాంకుగా చూసి మౌలిక సదుపాయాలను విస్మరించాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే వర్ధన్నపేట భవిష్యత్తును మార్చే భారీ ప్రాజెక్టులను తీసుకువచ్చామని వివరించారు. ప్రజల చెంతకే నాణ్యమైన వైద్యం అందించేందుకు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు. పేద విద్యార్థుల కోసం రూ. 200 కోట్లతో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం. కోనారెడ్డి పేట చెరువు ఫీడర్ ఛానల్ మరమ్మతులతో రైతులకు సాగునీటి భరోసా. సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పన. అభివృద్ధే అజెండాగా, నినాదంగా ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు పట్టణ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టమని, 12 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, సీనియర్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు చిటూరి రాజు, వార్డుల అధ్యక్షులు, ఇంచార్జీలు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.







# జాతరకు విచ్చేసిన ప్రముఖులు..

వనదేవతల దర్శనానికి పలువురు ప్రముఖులు తరలి వచ్చారు. శుక్రవారం రాత్రి, శనివారం వారు నిలువెత్తు బంగారం సమర్పించడంతోపాటు సమ్మక్క, సారలక్కను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర దంపతులు శుక్రవారం రాత్రి శ్రీ సమ్మక్క- సారలమ్మ తల్లులను దర్శించుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కుటుంబ సమేతంగా శనివారం ఉదయం 5 గంటలకు మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించారు. వీరి వెంట ములుగు అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఎండోమెంట్ శాఖ అధికారులున్నారు. హై కోర్ట్ జడ్జీలు సృజన, రాణి కుటుంబ సమేతంగా అమ్మవార్ల దర్శనానికి రాగా వారికి పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ప్రసాదం అందచేశారు. ఐజీ తరుణ్ జోషి, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, హనుమకొండ కలెక్టర్, మహబూబాద్ ఎస్పీ స్నేహ శబరిష్ కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ మేడారం జాతరలో వన దేవతలైన సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శించుకొని, గద్దెలకు మొక్కులు సమర్పించుకున్నారు.













# ఫార్వర్డ్ బ్లాక్ తో జాగృతి పొత్తు

- మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ
- రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలిసి పోటీ చేయనున్నట్లు జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ పొత్తు ద్వారా తెలంగాణ ఆత్మ, ఉద్యమ రాజకీయాలు, సామాజిక న్యాయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు జాగృతి నాయకత్వం స్పష్టం చేసింది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచే ప్రత్యేక గుర్తింపు పొందిన జాగృతి, రాష్ట్ర అవతరణ తర్వాత కూడా ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ వస్తోంది. ప్రభుత్వ విధానాల్లో లోపాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై నిష్పక్షపాతంగా ప్రశ్నలు లేవనెత్తుతున్న సంస్థగా జాగృతి గుర్తింపు పొందింది.

## సామాజిక తెలంగాణే ధ్యేయంగా..

రాష్ట్ర ప్రజలందరికీ సమాన న్యాయమే లక్ష్యంగా జాగృతి ముందుకు సాగుతోందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి దేశవ్యాప్తంగా చారిత్రక రాజకీయ నేపథ్యం ఉంది. కార్మికులు, రైతులు, పేద వర్గాల సమస్యలపై స్పష్టమైన వైఖరితో ఉన్న ఈ పార్టీతో జాగృతి కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కలయిక ద్వారా తెలంగాణ వాదం, సామాజిక న్యాయం, ఉద్యమ రాజకీయాలు ఒకే వేదికపైకి వచ్చాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## అణచివేయబడిన నాయకులకు అవకాశం..

ప్రస్తుత రాజకీయ పార్టీల్లో అవకాశాలు దక్కక, అణిచివేతకు గురవుతున్న స్థానిక నాయకులు, ఉద్యమకారులు ఈ కూటమి వైపు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. డబ్బు, బలమైన వర్గాల ఆధిపత్యం లేకుండా ప్రజల్లో పని చేసిన నాయకులకు టికెట్లు ఇవ్వాలనే ఆలోచన ఈ కూటమిలో ఉందని తెలుస్తోంది. ఇది నిజమైన తెలంగాణ వాదులకు, ఉద్యమకారులకు ఒక సువర్ణావకాశంగా మారిందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## ఎన్నికల్లో ప్రభావం ఎంత?

మున్సిపల్ ఎన్నికలు ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన అంశాలపై జరుగుతాయి. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, నిరుద్యోగం వంటి సమస్యలపై జాగృతి ఇప్పటికే పోరాటాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా యువత ఉద్యమ నేపథ్యం ఉన్న వర్గాల్లో జాగృతి – ఫార్వర్డ్ బ్లాక్ పొత్తు ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.




## రాజకీయ ప్రత్యామ్నాయం..

ప్రధాన పార్టీలపై పెరుగుతున్న అసంతృప్తి నేపథ్యంలో, ఈ కూటమి ఒక కొత్త రాజకీయ ప్రత్యామ్నాయానికి బీజం వేయవచ్చని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భవిష్యత్తు రాజకీయ దిశను సూచించే అవకాశముందని అంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి – ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలయిక తెలంగాణ రాజకీయాల్లో ఒక ఆసక్తికర అధ్యాయంగా మారింది. ఈ పొత్తు ప్రజల్లో ఎంతవరకు ఆదరణ పొందుతుందన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# హనుమకొండలో పాస్ పోర్ట్ సేవా కేంద్రం

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- పోస్టల్ సూపరింటెండెంట్ హనుమంతు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నక్కలగుట్ట ప్రాంతంలోని హనుమకొండ హెడ్ పోస్టాఫీస్ ప్రాంగణంలో తపాలా శాఖ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న పోస్టాఫీస్ పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ పోస్టల్ సూపరింటెండెంట్ వి.హనుమంతు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కేంద్రంలో కొత్త పాస్ పోర్ట్ దరఖాస్తులతోపాటు పాస్ పోర్ట్ రెనివల్, చిరునామా మార్పు, వ్యక్తిగత వివరాల సవరణ తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పాస్ పోర్ట్ కోసం హైదరాబాద్ లేదా ఇతర దూర ప్రాంతాలకు వెల్లకుండా హనుమకొండలోనే సౌకర్యవంతంగా ఈ సేవలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. పాస్ పోర్ట్ సేవలకోసం ముందుగా www.passportindia.gov.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో అపాయింట్ మెంట్ తీసుకొని అవసరమైన ధృవీకరణ పత్రాలతో నిర్ణీత తేదీలో పాస్ పోర్ట్ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా పారదర్శకంగా, సమర్ధవంతంగా పాస్ పోర్ట్ సేవలు అందిచనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించాలన్న లక్ష్యంతో ఈ పాస్ పోర్ట్ సేవా కేంద్రం పనిచేస్తుందన్నారు. హనుమకొండతోపాటు పరిసర ప్రాంతాల సాధారణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీ ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వి.హనుమంతు కోరారు.



# రంగసముద్రం చెరువు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించండి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఇంజనీరింగ్ అధికారులతో క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉర్సు రంగసముద్రం చెరువు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధిలోని ఉర్సు రంగసముద్రం చెరువు పనులను ఇరిగేషన్, రెవెన్యూ, కుడా, పబ్లిక్ హెల్త్, జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకంలో భాగంగా వరంగల్ పరిధిలోని ఉర్సు రంగసముద్రం చెరువు ఎంపిక కావడం జరిగినందున ఫోర్ షోర్ బండ్ అభివృద్ధి పనులను చేపట్టుటకు ప్రతిపాదనలు పూర్తి చేయాలన్నారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం వారు టెండర్ పిలిచి నందున సంబంధిత అభివృద్ధి పనులను కాంట్రాక్టర్ వెంటనే మొదలు పెట్టేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. అట్టి పనులను గ్రౌండ్ చేయడానికి ఇంజనీరింగ్, రెవెన్యూ, కుడా, పబ్లిక్ హెల్త్, జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇరిగేషన్ డీఈ మధుసూదన్, పబ్లిక్ హెల్త్ డీఈ మొజామిల్, బల్దియా డీఈ రంగారావు, ఏఈ సౌజన్య, ఇరిగేషన్ ఏఈ వేణుగోపాల్, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ముగిసిన జనజాతర..

నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర శనివారం రాత్రి ముగిసింది. ఆదివాసీ పూజారులు రాత్రి 7.50 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను వనంలోకి తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, ఆదివాసీ పూజారులు, వడ్డెలు అమ్మలకు ఘనంగా వీడ్కోలు పలికారు. దీంతో జాతర పరిసమాప్తం అయినట్లు ఆదివాసీ పూజారులు ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com